
# ఈ వారం కథ

- ఓదెల వెంకటేశ్వర్లు

"గనాడు బాగా తాగిండని చెప్పితే పట్టుకపోయి కొంకులిరగదన్ని "మళ్ళా తాగితే బొక్కలు ఇరుత్తం" అని చెప్పి పంపిండ్రు. ఇయ్యాల ఆళ్ళే సారా తాగే తందుకు అమ్మిత్తాండ్రు! "

## గీల్లూ చేసే పని గిదేనా



**ఇంకా రాపాయే ఈ మనిషి ఏం జెత్తాండో! ఏందో!**

అనుకుంట చేతులు పిస్కుంట అటు, ఇటు తిరుగుతాన్న కని మనసుల మనసు లేదు. మనిషి ఇంటికచ్చేదాక బరువసలేని పని చెయ్యవట్టే. జరంత ఆలస్యం అయితే ఏమైందో ఏమోనని బుగులు వట్టుకుంటది. చేసేది బొగ్గు బాయిల పని గందుకే గింత భయం. మనిషి అచ్చే యాల్లకు రాకపోతే సెడ్డ సెడ్డ ఆలోచనలు మతి కత్తై. నెలకింద గిట్లనే అచ్చే యాల్లకు మా ఇంటి ముంగటి ఎల్లన్న రాకపోయేటల్లకు ఇగత్తడు, అగత్తడు అని సూసుకుంట వుండంగా పీనుగును ఇంటికి మోసుకచ్చిండ్రు. బాయిల బండ కూలి సచ్చిండట. గది తలుసుకుంటే పానమంతా జడ్డిత్తది. పాపం బతుకుదామని బాయి పనికత్తె బండ కూలి సచ్చే ఇగెట్లా బతకాలే.

ఇగెట్లా! పొద్దుపురాంగ అంగింది. ఈయనేమో జాడలేకపాయే. ఏం జేత్తు! ఇయ్యాల జీతాలు ఇత్తాండ్రు. తీసుకునేటల్లకు ఆలస్యం అయితదని ఎరుకే. కని గింత ఆలస్యం అయితదా? భయం గావట్టే,గందుకే శీనుగాన్ని బాయి దగ్గరికి పంపిచ్చినా. మీదకి అచ్చిండో లేదో తెలుసుకరమ్మని తోలిన. ఈడు పత్త లేడు. ఇగ ఏం జెయ్యాలే. పానమంతా అగులు బుగులు కావట్టే. సైకిల్ సప్పుడైతే అటు చూసిన. శీనుగాడు అత్తాండు.

"ఎక్కుండటనారా"

"ఆ... ఎక్కు సొనసెపయ్యిందట. నర్సన్న మామ చెప్పిండు. ల్యాంప్ రూమ్ల సుత అడిగిన లైట్ పెట్టి పోయిండని చెప్పిండ్రు" అని చెప్పిండు.

మీదికైతే అచ్చిండు. కొద్దిగా పానం నిమ్మలం అనిపిచ్చింది. "జీతాలు ఇచ్చే లైన్ల సూసినవా?"

"ఆడిదాక పోయినోన్ని గాయింత సూడకుంట అచ్చిన్నా? జీతం తీసుకొని పోంగా చూసిండ్రట."

జీతం తీస్కొని ఇంటికి రాక ఎటు వోయినట్టు? గా జీతం పైసలే గింత కూడు వెట్టేది. బజిలి సక్కంగా చెయ్యనే చెయ్యడు. ఇగ నైట్ అయితే అసలే పోడు.

"పైమైతాంది బజిలి (డ్యూటీ) పోవా?" అని లేపితే

రామ్‌జీ

# "షేర్‌బజార్"

(మొదటి తెలుగు ఇన్‌వెస్ట్‌మెంట్ వీక్లీ)

A-2, Adchini, New Delhi-110 017

గౌరవనీయులైన, తెలుగు పాఠకులకు,

రామ్‌జీ నమస్కారాలు!

ఎవరబ్బా ఈ రామ్‌జీ అనుకొంటూ గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తున్నారా? అదేనండి బాబూ, "షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు" అనే ఆంధ్ర వార పత్రిక ద్వారా మీకందరికీ పరిచయమైన నేను, నా వంతు కర్తవ్యంగా తెలుగులో మీ ముందు "రామ్‌జీ షేర్‌బజార్" అనే ఇన్వెస్ట్‌మెంట్ వీక్లీతో ముందుకు వస్తున్నాను.

ఇది ఎంతో సాహసంగా ఉంది అని మందలించారు చాలా మంది మిత్రులు, కాని నాలో ఉన్న తహతహ, కుతూహలం ప్రజలకు సరైన గైడెన్స్ ఇవ్వాలని నా ప్రగాఢ కోరిక, నన్ను గమ్మున కూర్చోనివ్వలేదు. దాని ఫలితంగా తెగించి ఈ ఉగాది నుంచి "రామ్‌జీ షేర్‌బజార్" ను మీ ముందు ఉంచుతున్నాను.

నా ఈ ప్రయత్నంలో మీరు నాకు అండగా ఉంటేనే, నేను ముందుకు వెళ్ళగలను. పాఠకులంతా కూడా ఈ పత్రికను కొని, చదవాల్సిందిగా అదే విధంగా పారిశ్రామికవేత్తలు, వారియొక్క ప్రకటనలతోపాటు హాఫ్ ఇయర్లీ రిజల్ట్స్, యాన్యువల్ రిజల్ట్స్ మరియు పబ్లిక్ ఇష్యూలు, రైట్ ఇష్యూలతో వచ్చే కంపెనీలు, వారి యొక్క ప్రకటనలు మీ "రామ్‌జీ షేర్‌బజార్"కు ఇచ్చి ప్రోత్సహించ వలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాను.

మన రాష్ట్రంలోని ఎన్నో లైబ్రరీలతో పాటు మీరు కూడా తలొక కాపీ కొన్నా ఈ పత్రిక పురోగతికి అడ్డు లేదు.

వెల కేవలం 4-00 రూ.

ప్రత్యేక ధరలో సాంవత్సరిక చందా రూ. 150

మీ

రామ్‌జీ

షేర్‌బజార్

అన్ని ప్రదేశాలలోను డిపాజిట్టు కట్టకలిగిన ఏజంట్లు కావలెను. వివరములకు:

విజయవాడ, ఫోన్ : 65224

"నీ యవ్వ మంచి నిద్ర పాడుజేత్తివి... ఇయ్యాలొక్కనాడు పోకుంటే కంపినీ మూత వదుతలేదు" అని ముసుగువెదుతడు.

"రెండ్రోజుల సంది నాగలేనాయే (అబ్‌సెంట్) శోకపోతే ఎట్లా...?"

"ఏందే! తట్ట మోసేది నువ్వా? నేనా? అంగుదట్ట (వీపు మీద మోయడం) మోసి మోసి... ఈపంతా పుండైంది. బజిలి పోతినా బాయిల్నే సత్తా" అనుకుంట మీది మీది కచ్చిండు. అట్ల నంగనే కంట్లె నీరు గుబగుబ పొంగుకచ్చింది. అంతకన్న ఏం జేత్త.

బాయి పనికి రాక ముందు ఎంత మంచిగ నవ్వుకుంటా మాట్లాడేటోడు. పరాసిక మాడే టోడు. పానం లెక్క సూసుకున్నడు. ఇక్కడ కచ్చినంక ఒక్కసారన్న నవ్వింది లేదు. ఏం మాట్లాడిన సీదరించుకొంటాండు. ఇంటి కాడున్నప్పుడే నయం. పొద్దంతా పని చేసిన పొద్దంగినంక ఇంటికచ్చి అందుకొని తిన్నప్పుడు ముద్దుగా కలిసి వున్నం. బాయి పని పాడుగాను ఏం సుఖమున్నది!

అద్దంటే ఉన్నదమ్మి బాయిల పనికి పైరవి పట్టిండు. పని దొరికినంక బాగుపడతం అను కుంటే, రందిల పడ్డం. చేత్తేనే తినుడు. లేకుంటే ఎండుడు. ఉప్పు కారం మొదలు అరొక్కటీ కొనుడేనాయే. శీను గానికి పదిట్ల మంచిగ పాస్ కావాలని టూషన్ (ట్యూషన్) చెప్పిచ్చుడాయే. పుస్తకాలు. చిల్లర కర్సు అన్నిటికి పైసలు కావాల్నాయే. పని చెయ్యకపోతే పైసలు ఎట్ల అత్తయి. మీదికెల్లి అప్పు చేసుడాయే. అన్నిట్నీ ఎట్నో ఎల్లదీసుకుంటత్తే మంచిగనే వుండు. షోక్కు తాగుడు నేర్సిండు.

తాగుడింట్ల పీనిగెల్లా ఎవ్వని సాయిత గూడిండో, ఎవ్వడు నేర్పిండో, జీతమంతా తాగుడుకే తలుగవెట్ట వట్టిండు. ఇగెట్ల సచ్చుడు.

ఒకనాడు పొద్దుకూకినంక బాగా తాగచ్చిండు. ఇక నాకు దుఃఖమచ్చింది. కోపమచ్చింది. మాట్లాడకుంట సప్పుదు జేకనే ఊకున్న. అచ్చి మంచాల పన్నడు. కాసేపు పండి లేసి నన్ను పిలిసిండు.

"ఏందీ" అన్న దగ్గరకు పోయి.

"మాట్లాడత లేవ్వు" అన్నడు.

ఇక నాకు సిర్రుమన్నది. ఏం మాట్లాడాలే, బగ్గ తాగినవని మాట్లడన్న, తాగింది అరుగుత లేదని మాట్లాడన్న, తాగే తందుకు పైసలు సరిపోయినయ, లేకపోతే పైసలు గిట్ట కావాల్న అని మాట్లాడన్న" అన్న కోపంగా.

"పిచ్చి ముండ తాగుడు తప్పని ఎవ్వడన్నడే! మనిసి జలుమ (జన్మ) ఎత్తనంక అన్ని తినాలే తాగాల్నే! సచ్చిపోంగా ఎంబడి (వెంట) ఏం కొంచపోం"

"నువొక్కనివే మనిసివా? దేశం మీద ఎవ్వడైనా ఉన్నడా? తాగుడు కావన్నట తాగుడు... మూడ్నాల్గొద్దులు తాగి తలకు వోసుకొని నెలంతా ఏం తిందామనుకుంటానవ్. నన్ను పోరన్ని ఏం బెట్టి సాత్తవ్! ఆనికి సదువేం చెప్పిత్తవ్"

"ఆనికి ఇంక సదువు ఎందుకే! అని మందం అచ్చరం పోవడి అచ్చింది సాలు. ఏ దుకాండ్ల నన్న ఉంచితే నెలకు మూడ్నాల్గొందలు ఇత్తరు. ఎక్కొ తక్కొ సదువుతే ఉద్దోగాలు దొరుకుతాన్నయ్యా? రేబొయ్యి దుకాండ్ల మాట్లాడుతా" అన్నడు.

"నీ నోట్లె పొక్కులుపొడవ, పసి పోరన్ని దుకాండ్ల వుంచుతావ్. ఇజ్జతి మానం లేదు. నా పానం పోయిన మంచిదే ఆన్ని దుకాండ్ల వుంచ నియ్య" అని తిట్టిన.

"నువ్వుంచనిచ్చేదేందే! రేప్పొద్దుగాల తీసుక పోయి దుకాండ్ల వుంచి రాకపోతే సూడు" అన్నడు.

గట్లనే వరకు శీనుగానికి భయం బుట్టింది.

"నేను దుకాండ్ల వుండనే, సదువుకుంటా" అన్నడు.

"సెప్పినట్టు ఇనకపోతివి సత్తవ్ బిడ్డా"

"సచ్చినా మంచిదే దుకాండ్లనైతే వుండ"

"వుండవా?"

"వుండ"

"వుండవా"

"ఊహు"

"నీ యవ్వ పోరనికిన్న వడిత్తేచెప్పినట్టు యినవా" అనుకుంటా ఇయ్యర మయ్యర కొట్ట వట్టిండు. అడ్డం పోయిన నన్ను "లంజముండ నువ్వు జెయ్యవట్టే ఇట్లైయ్యిందు ముందుగ నిన్ను తన్నాలన్నే" అని నా జుట్టు వట్టి ఇట్టం అచ్చినట్టు కొట్టిండు. ముట్టుకుంటే మాసి పోతవు అన్నట్టుగా చూసినోడు నన్ను కొట్టిండు ఆ తాగుడు చెయ్యవట్టి. ఇగ నేను నోటి కచ్చినట్టు తిట్టిన, చేతి కచ్చినట్టు కొట్టవట్టిండు. ఇడిపిచ్చే తందుకు అత్తే "నా పెండ్లాని నేను కొట్టుకుంటా నువ్వెవనివి" అన్నాడు. అందరు దూరం పోయిండ్రు. రాత్రి తెల్లందాకా (తెల్లవార్లు) నొర్లి వెట్టుడు, కొట్టుడు ఇంటి పక్కొల్లందరికి నిద్ర లేకుంట జేసిండు. నలుగురు పోయి పోలీసులకు చెప్పి స్టేషన్‌కు పట్టిచ్చిండ్రు.

ఇజ్జతి మానం పోయే కాలం అచ్చిందను కుంటా, ఏడ్సుకుంట వొాళ్లకు పోయిన. కట్టుకున్న గాడ్డి కొడుకు నాకు తప్పద్దా!

లోపలికి పొయి రెండు చేతులెత్తి పబ్బతి వట్టినా! "ఆదు నా మొగుదు జర ఇడిసి పెట్టుం

ండ్రి'' అని ఏడ్చినా. ''అరేయ్ ఇంకోసారి తాగినవని తెలిత్తే నీ బొక్కలు యిరగ్గొడతం పో సాలే'' అని మెడలు పట్టి దొబ్బేసిండ్రు. కొంకులిరగ కొట్టినట్టున్నరు నడువత్తలేదు. రిచ్చల ఇంటికి తీసుకచ్చినా. ఇంకోసారి తాగకు నీకు దండం బెడుతా అని చెప్పినా. నా మాట ఇనలే. మల్లా ఎప్పటి లెక్కనే తాగుడు, కొట్టుడు చెయ్య వట్టిండు.

ఎట్లా మారతడు భగవంతుడా అని అన్ని దేవుండ్లకు మొక్కిన. ఇట్ల బతుకుడు కన్న సచ్చుడే నయం అని ఎన్నో మాట్ల అనుకున్న గాని పోరని మొఖం చూసి వూకున్న. కొన్నొద్దులు అయినంక ''అన్నలు సారా దుకాండ్లు బంద్ వెట్టిత్తరట'' అని సెప్పుకోవట్టిండ్రు.

ఇక నాకు సచ్చేదానికి పానం అచ్చినట్టయ్యింది. నిజంగనే బందు పెడుతరా? బందు వెడితే ఎవ్వలు కుంటరు. అనుకున్న కాని మనసుల అన్నలు చెప్పింది చేత్తరు అనిపిచ్చింది.

ఇంకేమున్నది సారా దుకాండ్లు బంద్ పెట్టాలని పేపర్ల రాసిండ్రట. అందరూ ఇదే ముచ్చట చెప్పుకోవట్టిండ్రు. సారా దుకాండ్లు తీత్తే మంచిగుండదని చెప్పిండ్రట. ఇననొన్ని తన్నిండ్రని కూడా అనుకోవట్టిండ్రు. ఎట్లైతేంది పురాగ సారా అమ్ముడు బందు చేసిరి. అవ్వనీ బాంచను మా సంసారం సక్కగైతదనుకున్న. ఈ ముండ కొడుక్కు తాగుతనే రోగం పుట్టుకత్తది. తాగుడు లేకపోతే మంచిగనే వుంటడు.

తాగిన పానమాయే కొన్నొద్దులు తల్లడిల్లిండు. ఏం జేత్తేమున్నది సారా చుక్క దొరకకుంట అయ్యింది. మంచిగనే బజిరి పోతాండు. జీతం ఇంటికి తెత్తాండు. మరి ఇయ్యాల్నేమో ఇంకా ఇంటికి రాకపాయే. ఎటు పోయ్యుంటడు... ఎట్లా... ఎట్లా.

ఆకిట్లా అలికిడైతే అటు సూసిన తూలు కుంట తూలుకుంట అత్తాండు. పొడి పొడి పానాలు తీసినట్టై కండ్లు నిలవడిపోయినై. నోట్లె కెల్లి సారా వాసన సిఘ్రుమంటాంది. మళ్ళా తాగిండు. యెక్కడ దొరికింది. ఎవ్వలమ్మి తాండ్రు. అన్నలకు తెలిత్తే బొక్కలు యిరుత్తరు. అన్ని తెలిసే అమ్ముతాండ్రు అనుకున్న. ''యేడ తాగచ్చినవ్'' అని అడిగిన. పోలీస్ టేషన్ల సారా అమ్ముతాండ్రట. ఆయనే చెప్పిండు. పోలీసోల్లు కూసుండి అమ్మిత్తాండ్రట. నిలువున సల్లటి నీళ్ళల్లో ముంచి లేవట్టినట్టయ్యింది.

గవాడు బాగా తాగిండని చెప్పితే పట్టుకపోయి కొంకులిరగదన్ని ''మళ్ళా తాగితే బొక్కలు యిరుత్తం'' అని చెప్పి పంపిండ్రు. ఇయ్యాల ఆళ్లే సారా తాగేతందుకు అమ్మిత్తాండ్రు అంటే నాకు నమ్మబుద్ధి కాలే.

ఎందుకట్లా సేత్తాండ్రు అంటే గవుర్మెంట్ చెప్పినట్టు చెయ్యాల్నట. నాకు బాగా కోపం అచ్చింది.

ఎట్లాగీ గవుర్మెంటుకు సిగ్గే లేదాయే. మరీ అమ్మండ్రి అనంగనే అమ్మేతందుకు ఈళ్లకు చేతులెట్ల అచ్చినయో మీకు తెలిత్తే నాకు చెప్పండ్రి. గిట్లా చేసే పని గిదేనా?

◆

''మా అమ్మాయికి నృత్యం, సంగీతం, కారు డ్రైవింగ్, ఈతకొట్టడం అన్నీ వచ్చు. మరి నీకేమొచ్చు మా అమ్మాయి పెళ్ళి చేసుకోవడానికి'' అడిగాడు సూర్యారావు దర్పంగా.

''నాకు వంట చెయ్యడం బాగా వచ్చు సార్'' చెప్పాడు వినయంగా రాంబాబు.

— గొల్లపూడి శైలజ




**PHONES : 58279, 59247, 59347**

**SIDDHARTHA RESIDENTIAL SCHOOL**

**EDUPUGALLU** KRISHNA (DT.) -A.P. PIN - 521 144

***(Affiliated to CBSE - Delhi - Established in 1986)***

Applications will be issued for classes L.K.G. to X on payment of Rs. 50/- by cash or Rs. 60/- through M.O. Admissions will be for Day-Scholars and Hostellers for both Boys and Girls. Applications will be issued for XIth class also.

**NOTE: Our school has got the National Merit Certificate from CBSE - Delhi during the exams conducted in March, 1991 in All India level to Miss M. Hemavathi with Regd. No.4106266 in the subject of Mathematics scoring 99/100.**

A full fledged Residential School with 100% results equipped with all facilities. For other details contact office between **10.00 A.M. to 2.00 P.M.** on working days.

**VADDE RAMAKRISHNA PRASAD**

DIRECTOR